
# ఉపాధ్యాయులే జాతి నిర్మాతలు..

**టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం.. - 60 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం..**

**హాజరైన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు,మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు..**



**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న 60 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి సన్మాన పత్రం, మెమోంటో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ పలువురు టీడీపీ నాయకులు ప్రసంగించారు.

ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు,మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మాట్లాడుతూ,

సెప్టెంబర్ 5వ తేదీ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతితో పాటు ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకునే పవిత్రమైన రోజని అన్నారు. మనిషిలోని అజ్ఞానం అనే చీకటిని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగించేది విద్య అని పేర్కొన్నారు. సర్పంచ్ నుంచి ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి వరకు ప్రతి ఒక్కరి ఎదుగుదలలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్యా రంగంలో ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు చేసిన కృషిని ఆయన వివరించారు. భారతదేశంలోనే మొట్టమొదటి ఆశ్రమ పాఠశాలను ఎన్టీఆర్ ప్రారంభించారని, అనంతరం చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వాటిని అన్ని నియోజకవర్గాలకు విస్తరించారని తెలిపారు. అందరికీ విద్య అందించాలనే లక్ష్యంతో పలు కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. చదువుల పండుగ, మధ్యాహ్న భోజన పథకం వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులను విద్య వైపు ప్రోత్సహించారని అన్నారు.

చంద్రబాబు నాయుడు హయాంలో దాదాపు ఏడాదికి ఒకటి చొప్పున 11 డీఎస్సీ నోటిఫికేషన్లు జారీ చేసి,వాటి ద్వారా 1.46 లక్షల ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు బక్కని నర్సింహులు పేర్కొన్నారు. హైస్కూల్ విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ, పేద విద్యార్థులకు విద్యా అవకాశాలు కల్పించడం వంటి కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో చదువు మధ్యలో నిలిపివేసిన పేదలకు 'బ్యాక్ టు స్కూల్' కార్యక్రమం ఎంతో ఉపయోగపడిందన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రాంతంలో 560 మంది పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారందరికీ అభినందనలు తెలియజేసిన ఆయన,టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం మేరకు పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ,

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జన్మనిచ్చిన తల్లి మొదటి ఉపాధ్యాయురాలని, ఉపాధ్యాయులు తల్లి స్థానంలో ఉంటారని అన్నారు. అలాంటి గురువులను సత్కరించుకోవడం తమ అదృష్టమన్నారు. తెలంగాణలో టీడీపీ అధికారంలో లేకపోయినా గత 15 ఏళ్లుగా ప్రతి సంవత్సరం ఉపాధ్యాయులను గౌరవించుకుంటున్నామని చెప్పారు. ఎన్టీఆర్,చంద్రబాబు నాయుడు,నారా లోకేష్‌కు ఉపాధ్యాయులంటే ఎంతో గౌరవం ఉందని, అదే స్ఫూర్తితో టీడీపీ ఉపాధ్యాయులను సత్కరిస్తోందన్నారు. ఉపాధ్యాయుల ద్వారా సరైన శిక్షణ పొందిన విద్యార్థులే గ్రామం నుంచి దేశం వరకు అభివృద్ధికి బాటలు వేస్తారని పేర్కొన్నారు.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని నేటికీ దేశవ్యాప్తంగా నిర్వహించడానికి ఆయన ఉపాధ్యాయుడిగా అందించిన సేవలే కారణమని అరవింద్‌కుమార్ గౌడ్ అన్నారు. టీడీపీ అధికారంలోకి రాకముందు పేదలకు విద్య అందుకోవడం కష్టంగా ఉండేదని,ఎన్టీఆర్,చంద్రబాబు నాయకత్వంలో విద్యను సామాన్యులకు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.

హైదరాబాద్ అభివృద్ధిలో చంద్రబాబు నాయుడు పాత్రను కూడా ఆయన ప్రస్తావించారు. హైటెక్ సిటీ నిర్మాణం, అంతర్జాతీయ ఐటీ సంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావడం ద్వారా సైబరాబాద్ అభివృద్ధికి పునాదులు వేశారని, దీనివల్ల లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయని అన్నారు. తెలంగాణ అభివృద్ధిలో టీడీపీ పాత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడు

నన్నూరి నర్సిరెడ్డి మాట్లాడుతూ, ఎన్టీఆర్ భవన్‌లో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయుడిగా,జాతీయోద్యమంలో పాల్గొన్న వ్యక్తిగా,రాయబారిగా, తత్వవేత్తగా, ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా రాధాకృష్ణ విశిష్ట సేవలు అందించారని కొనియాడారు.

ఆయనను నిజమైన భారతరత్నగా అభివర్ణించారు. స్వామి వివేకానంద భారతీయ ఆధ్యాత్మిక విప్లవానికి ప్రతీక అయితే,డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ భారతీయ తాత్విక విప్లవానికి ప్రతీక అని నన్నూరి నర్సిరెడ్డి పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థులు, యువత చేతుల్లో ఉందని,వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే పవిత్ర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అందుకే ఉపాధ్యాయులను నిజమైన జాతి నిర్మాతలుగా భావించాలని చెప్పారు.

టీడీపీ జాతీయ క్రమశిక్షణ కమిటీ మాజీ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ,

గతంలో విద్యార్థులు విద్యను అభ్యసించేవారని,ప్రస్తుతం విద్యను కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గతంలో ఉపాధ్యాయులు పాఠశాలల్లోని విద్యార్థులను సొంత బిడ్డలుగా భావించి బాధ్యత తీసుకునేవారని గుర్తుచేశారు. ఎన్టీఆర్ అడుగుజాడల్లో చంద్రబాబు నాయుడు నడుస్తున్నారని,నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా విద్యారంగాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు.

రాష్ట్ర పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు సామ భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ,

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఆలోచనలను ఆచరణలో పెట్టిన నాయకుడు చంద్రబాబు నాయుడు అని అన్నారు. ఒక కుటుంబంలో ఒక విద్యావంతుడు ఉంటే ఆ కుటుంబానికే కాకుండా సమాజానికి, దేశానికి ప్రయోజనం కలుగుతుందనే భావనతో చంద్రబాబు విద్యకు ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు.

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం మాజీ అధ్యక్షుడు ముంజా వెంకట రాజం గౌడ్,అజ్మీరా రాజునాయక్, మల్కాజ్‌గిరి పార్లమెంట్ పార్టీ కన్వీనర్ కందికంటి అశోక్‌కుమార్ గౌడ్,నెల్లూరి దుర్గాప్రసాద్, సైదేశ్వర్‌రావు,ఎంపీపీ రమేష్‌బాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న,రాష్ట్ర పార్టీ మాజీ ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ ప్రసూన,సూర్యదేవర లత, కాణిపాకం దేవస్థానం పాలకమండలి సభ్యుడు శ్రీపతి సతీష్,గోపి,పోలంపల్లి అశోక్, వెలివెల దుర్గాప్రసాద్,నల్లగొండ పార్లమెంట్ పార్టీ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్‌రెడ్డి,సంధ్యపోగు రాజశేఖర్,వేజెండ్ల కిశోర్‌బాబు, సుభాషిణి,యాదిలాల్, నాగేంద్రబాబు,గూడెపు రాఘవులు,జగదీష్ తదితర పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు



